క్లుప్తంగా

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



కేటీదొడ్డి: కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ కిసాన్‌మోర్చా అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి కోరారు. మండలంలోని గువ్వలదిన్నెలోని సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు చేపట్టిన అభివృద్ధిని ప్రచార రథంలోని ఎల్‌ఈడీ ద్వారా ప్రజలు వీక్షించారు. అనంతరం క్యాలెండర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచు మహాదేవి, పంచాయతీ సెక్రటరీ బేగు ఉన్నారు.

మట్టి తరలిస్తున్న వారిపై కేసు నమోదు



ధరూరు: ఎలాంటి అనుమతి లేకుండా నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందం గౌడ్ తెలిపారు. మండలంలోని ర్యాలంపాడు గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో 9 ట్రాక్టర్ల ద్వారా ఆదివారం రాత్రి మట్టి తరలింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకున్న రేవులపల్లి ఎస్‌ఐ అర్ధరాత్రి మట్టి తరలిస్తున్న ప్రాంతానికి వెళ్లి తొమ్మిది ట్రాక్టర్లు, జేసీబీని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మట్టి తరలిస్తున్న 10 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గడ్డివాములు దగ్ధం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని రైతు కల్లాల్లో రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. సోమవారం తెల్లాజామున 2.30 గంటల సమయంలో కల్లాలో రైతులు నరసింహ, నారాయణలు గడ్డివాములు ఏర్పాటు చేసుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడడంతో కాలిపోయాయి. 100కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ డిపార్ట్‌మెంట్ అలంపూర్ చౌరస్తాలోని ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలు అదుపు చేసేలోపు రెండు గడ్డివాములు బూడిదయ్యాయి. దాదాపు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితులు పేర్కొన్నారు.

టాలెంట్ టెస్టు కరపత్రాల విడుదల



గట్టు: నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించే టాలెంట్ టెస్టుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఉన్నత పాఠశాలలో విడుదల చేశారు. విద్యార్థులకు ఈ నెల 31న జిల్లా కేంద్రంలో టాలెంట్ టెస్టును నిర్వహిస్తున్నట్లు ఎన్‌టీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాల్వాయి లక్ష్మీనారాయణ తెలిపారు. టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ ఓబులేష్, ఎన్‌టీఎస్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి ప్రతాప్, ఉపాధ్యాయులు శివశంకర్, శివప్రసాద్, పరుశరాం, రాజుసాగర్, నర్సింహులు, నర్సింహులుగౌడు పాల్గొన్నారు.

ఒకరిపై ఒకరు పరస్పర దాడులు

కేటీదొడ్డి: గర్భగుడిలోకి ప్రవేశించిన వ్యక్తిని ఎందుకు వెళ్లావంటూ నిలదీసిన వ్యక్తికి మధ్య మాటమాట పెరిగి దాడులకు దారితీసింది. ఈ ఘటన మండలంలోని పాతపాలెంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. పాతపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన విశ్వనాథ్ గర్భగుడిలోకి ప్రవేశించాడు. దీంతో జనార్దన్ అతన్ని ఎందుకు వెళ్లావని ప్రశ్నించారు. గర్భగుడిలో ఇతరులు వెళ్లరాదని ఆలయ నిర్వాహకులు తీర్మానించారని, ఈ సందర్భంగా గుర్తు చేశాడు. దీంతో ఇద్దరి మధ్య మాటమాట పెరిగింది. ఒకరినొకరు దూషించుకుంటూ దాడులకు పాల్పడ్డారు. ఇద్దరు కేటీదొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.



పుల్లూరులో పెద్ద స్క్రీన్‌పై అయోధ్యలో రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ తిలకిస్తున్న భక్తులు



క్యాతూర్‌లో సీతారాముల విగ్రహాలపై తలంబ్రాలు పోస్తున్న భక్తులు



జైశ్రీరామ్ పేరుతో ప్రత్యేకంగా అలంకరించిన బీచుపల్లి ఆలయం

ఊరూరా శ్రీరామ నామస్మరణ

- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు
- ఘనంగా సీతారాముల కల్యాణం
- భక్తులకు అన్నదానం కార్యక్రమం
- కనుల పండువగా శోభాయాత్ర
- ఇళ్ల ముందు దీపాలు వెలిగించిన మహిళలు
- ఆలయాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్ల ఏర్పాటు

అలంపూర్: ఊరూరా శ్రీరాముని నామస్మరణ మార్మోగింది. గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలు నిర్వహించారు. సాయంత్ర శోభాయాత్ర నిర్వహించారు. ఇంటి ముంగిళ్లలో ఐదు దీపాలు వెలిగించారు. రాముల వారి అక్షతలతో ఆశీర్వచనాలు తీసుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేసి అయోధ్య శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ తిలకించారు.

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్‌లో సీతారామాంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల విగ్రహాలపై భక్తులు తలంబ్రాలు వేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. సీతారాముల ఉత్స వ విగ్రహాలను పురవీధుల గుండా ఊరేగించారు.

జోగుళాంబ శక్తిపీఠం: అయోధ్య రామమందిర పునఃప్రతిష్ఠలో భాగంగా భక్తులు తమ భక్తిని చాటుకున్నారు. అలంపూర్ పట్టణంలోని ఇళ్లల్లో ఐదు రామజ్యోతులను వెలిగించడం, ఆలయాల్లో రామనామ గానాన్ని ఆలపిస్తూ భజనలు చేశారు. ఆలయాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలో పలు ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. ఆంజనేయస్వామి ఆలయంలో వివిధ పుష్పాలతో జైశ్రీరామ్ అని ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు ఉదయాన్నే బీచుపల్లి పుణ్యక్షేత్రానికి చేరుకొని కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం శివాలయం, అభయాంజనేయస్వామి ఆలయాల్లో అభిషేకం, ఆకుపూజ, అర్చన చేశారు. ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల్లోని ఆయా గ్రామాల ఆలయాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు. దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు.

ధరూరు: మండల కేంద్రంలో సాయంత్రం శోభాయాత్ర కనుల పండువగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి పాత బస్టాండు, కొత్త బస్టాండు మీదుగా యాత్ర కొనసాగింది. బూరెడ్డిపల్లిలో ఆలయం వద్ద జై శ్రీరాం ఆకారంలో వెలిగించి దీపాలు ఆకట్టుకున్నాయి. పెద్ద ఎత్తున బాణా సంచా కాల్చి యువత సంబరం చేకున్నారు. కార్యక్రమంలో బండ్ల రాజశేఖర్‌రెడ్డి, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్ పర్సన్ బండ్ల లక్ష్మీదేవమ్మ, బండ్ల జ్యోతి, నాగేశ్వర్‌రెడ్డి, డీఆర్ విజయ్‌కుమార్, రాజారెడ్డి పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని గోకులపాడు, అమరవాయి, మానవపాడు, చెన్నిపాడులో ఊరేగింపు చేశారు. పాటలు, భజన లు, కీర్తనలు సంబరంగా నిర్వహించారు. చిన్నపోతులపాడులో సీతారాముల కల్యాణం అంగరంగా వైభవంగా నిర్వహించారు.

అయిజ: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మండలంలో, వివిధ గ్రామాల్లోని శ్రీరాముడి ఆలయాలతో పాటు ఆంజేయస్వామి ఆలయాల్లో వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. భజన మండలి సభ్యులు శ్రీరాముడి కీర్తనలు ఆలకించారు. వివిధ గ్రామాల్లో సీతారాములవారి ఉత్సవ విగ్రహాలను కనుల పండువగా ఊరేగించారు. మండల కేంద్రంలో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. సీత, రాముడు, లక్ష్మణుడు, ఆంజనేయుడు వేషాధారణతో పాటు పరివారం వేషాధారణతో చిన్నారులు అలరించారు. ఆలయాలవద్ద భోజనవసతి కల్పించారు. శ్రీరాముడి నామస్మరణతో ఆలయాల పరిసరాలు మార్మోగాయి. చిన్నతాండ్రపాడులో రాములవారి ఆలయంపై నూతనంగా శిఖరం ప్రారంభం సందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పులికల్‌లో భీర లింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గట్టు: మండల కేంద్రంలో సీతారాముల విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. గండి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గూడురు వీరభద్రప్ప, నాగప్ప సోదరులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మాచర్ల, బల్గెర, ఇందువాసి, బోయలగూడెం, చాగదోణ, యల్లందొడ్డి గ్రామాల్లోని ఆలయాల్లో శ్రీరామ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

మల్దకల్: మండల కేంద్రంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను శోభాయాత్ర నిర్వహించారు. శేషంపల్లి, మల్దకల్, తాటికుంట, అమరవాయి, నాగర్‌దొడ్డి, బిజ్వారం గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. ఆదిశిలాక్షేత్రంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలు ఊరేగించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, నాయకులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని వివిధ గ్రామాల ఆలయాల్లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీరాముడి, హనుమ విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు వీక్షించేందుకు ఎల్‌ఈడీలు ఏర్పాటు చేశారు.



గట్టులో సీతారామ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



అయిజలో రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



చిన్న తాండ్రపాడులో పూజలకు హాజరైన భక్తులు



గద్వాలలో భక్తులకు హారతి ఇస్తున్న పండితుడు



గద్వాల పాఠశాలలో విద్యార్థులు ఫజిల్ రూపంలో తయారు చేసిన శ్రీరాముడి భారీ చిత్రం



కేటీదొడ్డి ఆలయంలో భజన చేస్తున్న భక్తులు



చిన్నపోతులపాడులో రాముల వారి విగ్రహాల ఊరేగింపు



గద్వాల మండలం పిలుగుండ్ల ఆలయంలో హోమం



అయిజలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



కేటీదొడ్డిలో ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం



అలంపూర్‌లో సీతారాముల శోభాయాత్ర

నిధులున్నా.. నిర్లక్ష్యమే!

- అభివృద్ధికి నోచుకోని గ్రామాలు
- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- ప్రగతిలోనే రూ.21 లక్షల అంతర్గత రోడ్లు..
- అధికారుల అలసత్వం.. ప్రజలకు ఇక్కట్లు



లింగన్‌వాయిలో మరమ్మతుకు నోచుకోని అంతర్గత రోడ్డు

అలంపూర్ రూరల్: మండలంలోని గ్రామాలలో అభివృద్ధి చేసేందుకు రూ.కోట్లలో నిధులు మంజూరయ్యాయి. గ్రామ పంచాయతీ నూతన భవనాలకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. మండలంలోని ఏడు గ్రామాలకు ఈఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల కింద ఒక్కొక్క భవనానికి రూ.20లక్షల చొప్పున నూతన గ్రామ పంచాయతీలకు మంజూరయ్యాయి. వాటిలో ర్యాలంపాడ్, జిల్లెలపాడ్ గ్రామాలలో భవనాలు చివరి దశలో ఉన్నాయి. కాశీపూర్, సింగవరం-2, కోనేరు, భీమవరం, భైరంపల్లి గ్రామాలలో ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు. ప్రజలు అంతర్గత రోడ్లతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్లపై నీళ్లు చేరి బురద పెరుకుంటుంది. ప్రజలు నడిచేందుకు వీలు లేకుండా అవస్థలు పడాల్సి వస్తుంది. రోడ్లకు రూ.21లక్షలు మంజూరై నెలలు గడుస్తున్నా గ్రామాల్లో పనులు కొనసాగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. పాఠశాల భవనాల మరమ్మతు కోసం వచ్చిన నిధుల్లో కోనేరు మండల ప్రజా పరిషత్ పాఠశాలకు రూ.3లక్షల పనులు ప్రగతిలో ఉన్నాయి. సైడ్ డ్రెయిన్ పనులు మరమ్మతులకు నోచుకోలేదు. మైనార్టీ, ఈడుగ, కుల సంఘాల భవన నిర్మాణాలు ప్రారంభం కాలేదు. అభివృద్ధి కోసం ప్రతి గ్రామానికి రూ.10లక్షల ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. పూడూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి జిల్లెలపాడ్ గ్రామం వరకు బీటీకి సీఆర్‌ఆర్ రూ.3.96 కోట్లు, బ్రిడ్జి నిర్మాణం, బీటీకి రూ.4.40 కోట్లు నిధులు మంజూరయ్యాయి. నిధులు మంజూరైనా పనుల్లో మాత్రం వేగంగా చేయడం లేదు. సర్పంచ్‌లు, అధికారులు పనులు వేగవంతం చేయడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలంపూర్ నుంచి గొందిమల్ల, అలంపూర్ నుంచి కోనేరుకు వేసిన రోడ్లలలో నాణ్యత లేకపోవడంతో గుంతలమయంగా మారాయి. అలంపూర్ నుంచి కాశీపురం మీదుగా కర్నూల్‌కు నిత్యం ప్రజల ఈ దారిగుండానే వెళ్తుంటారు. రోడ్డు గుంతలమయంగా మారి ప్రమాదాలు సంభవిస్తున్నా అధికారులు వాటి మరమ్మతు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే పనులు వేగవంతం కావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగుస్తున్నా పనుల్లో ప్రగతి కనిపించడం లేదు.



ర్యాలంపాడ్-జిల్లెలపాడ్ రోడ్డుపై గుంతలు

పనులలో పురోగతి లేదు..



మండలంలోని గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరైనా పనుల్లో పురోగతి లేదు. అధికా రుల పర్యవేక్షణ కొరవడడంతో పనులు నత్త నడకన నడుస్తున్నాయి. గ్రామాల్లో చిన్నపాటి వర్షం కురిసినా అంతర్గత రోడ్ల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ప్రజల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

– జీకే ఈదన్న, సీపీఎం జిల్లా నాయకుడు

పనులు వేగవంతంగా చేపడుతున్నాం..

పనులను వేగవంతంగా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. గ్రామ పంచాయతీ భవన నిర్మాణాల కోసం స్థలసేకరణ చేపడుతున్నాం. పనులు జరిగే ప్రతిచోట పర్యవేక్షిస్తున్నాం. తగిన సూచనలు, సలహాలతో పనులను చేపడుతున్నాం.

– శ్రీనివాసులు, పంచాయతీ రాజ్, ఏఈ

రాములోరికి పట్టాభిషేకం



కొంకలలో శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయస్వాములకు పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న భక్తులు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాల్లో రామ నామస్మరణ మార్మోగింది. ఆంజనేయస్వామి, రామాలయాల్లో అభిషేకాలు, పట్టాభిషేకం నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం శ్రీసీతారామలక్ష్మణ సమేతంగా ఆంజనేయస్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. శోభాయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది.

జీఓ 19ను రద్దు చేయాలి

ధరూరు: జీఓ 19ను రద్దు చేసి బీసీ కురువ సామాజిక వర్గానికి చెందిన వారికి ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయొద్దని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వహీదా ఖాతున్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మార్లబీడు సుధాకర్, దేవదాసు, సుందర్‌రాజు, ఏసన్న, ఆశీర్వాదం, పౌలు, మారెప్ప, ఆదాం, సామేలు, సవారప్ప, బొబ్బిలి భాస్కర్ పాల్గొన్నారు.

గట్టు: జీఓ 19ను రద్దు చేయాలంటూ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ డిమాండ్ చేశారు. వివిధ గ్రామాలకు చెందిన దళిత సంఘం నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. కుర్వలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలను జారీ చేసేందుకు ఉద్దేశించిన జీఓ 19ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.



తహసీల్దార్ వహీదాఖాతున్‌కు వినతి పత్రం అందజేస్తున్న దళిత సంఘం నాయకులు

ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు

ఉండవెల్లి: ఒక వ్యక్తిపై ముగ్గురు దాడి చేయగా తీవ్రగాయాలు కావడంతో వారిపై కేసు నమోదు చేసిన ఘటన సోమవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ బాల్‌రాజు కథనం ప్రకారం.. మండల కేంద్రంలో ఇంటి పక్కల ఉన్న గీత వారి పిల్లలను తిడుతుంటే ఎందుకు తిడుతావని కుర్వ మహేష్ అడగడంతో అతనితో వాగ్వాదానికి దిగారు. తన భార్యమీద ఎందుకు అరుస్తున్నావంటూ మద్దిలేటి అతని తలపై రాయితో దాడి చేశాడు. అతని తల్లి గంగమ్మ సైతం కుర్వ మహేష్‌పై దాడికి పాల్పడింది. దీంతో ముగ్గురిపై పోలీస్‌స్టేషన్‌లో మహేష్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.